
సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 32వ డివిజన్ పాత గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ గౌర రమాదేవిశ్రీనివాస్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాలక వర్గం కొలువుదీరిన తర్వాత కార్పొరేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, సూర్లగంటి విజయ్, కుమార్ పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

- డీఆర్డీవో డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డీవో డైరెక్టర్ డాక్టర్. ఎల్ రామకృష్ణ హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి మోక్షగుండం చేసిన సేవలను కొనియాడారు. నేటి విద్యార్థులు మోక్షగుండంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.



డీఆర్డీవో డైరెక్టర్ రామకృష్ణకు మెమెంటోను అందజేస్తున్న జయప్రద



పేదింటి మహిళలకు కుట్టుమెషిన్లు అందజేస్తున్న రాఖేష్‌శర్మ

పేదలకు ఆపన్న హస్తం రైస్ ఏటీఎం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఆపన్నహస్తంలా రైస్ ఏటీఎం నిలుస్తోందని జేబీసీ జాతీయ అధ్యక్షుడు జేఎఫ్ఎస్ రాఖేష్‌శర్మ పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ రాక్‌టౌని కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద శనివారం కరోనా కారణంగా ఉపాధి కోల్పోయిన పది కుటుంబాలకు చెందిన పేదింటి మహిళలకు జూనియర్ జేబీసీ మింగ్ నేత్ర ఆధ్వర్యంలో కుట్టు మెషిన్లు, తోపుడు బండ్లను రైస్ ఏటీఎం వ్యవస్థాపకుడు, స్వచ్ఛంద సేవకుడు దోసపాటి రాముతో కలిసి రాఖేష్‌శర్మ అందజేశారు. కార్యక్రమంలో జేబీసీ జోన్-12 అధ్యక్షుడు గోవింద్ కంకణి, ఉపాధ్యక్షుడు జేసీ హరి కోయల్కర్, ఆయూష్ సరేగి, గౌతమ్‌కుమార్ జైన్, జేసీ జయంత్ శెట్టి పాల్గొన్నారు.

ఘనంగా శ్రేయాస్‌లో గ్రాడ్యుయేషన్ డే

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అఫ్ లజులైన్ బయోటెక్ లిమిటెడ్ కోఫౌండర్ అండ్ సీఈవో ప్రసాద్ కం దిమళ్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల డిగ్రీ విద్య విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేలా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ చింతల రవీంద్రనాథ్‌యాదవ్, వైస్ చైర్మన్ అనంతుల హిద్రయరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే సాగర్, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో విద్యార్థికి మెడల్‌ను అందజేస్తున్న ప్రసాద్

ప్రైవేటు టీచర్లకూ శిక్షణ ఇప్పించాలి

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సైతం శిక్షణ ఇప్పించాలని రంగారెడ్డి జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శి ఎంఏ గుల్నాని పేర్కొన్నారు. ఈ మేరకు షెడ్యూలు కులాల అభివృద్ధిశాఖ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్‌కు శనివారం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మధుసూదన్, అడ్వైజర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుల్నాని మాట్లాడుతూ ఒక విద్యాసంవత్సరంలో తప్పనిసరిగా పాఠశాలలను 220 రోజులు కచ్చితంగా నడిపించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని, లోకల్ సెలవులుగా అన్నింటిని వర్కింగ్ డేలో కలపాలని కోరారు.


ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేసిన ట్రస్మా ప్రతినిధులు

దేశాభివృద్ధికి విద్యార్థులే మూలస్తంభాలు

ఎల్‌బీనగర్ : దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలమని, వారే దేశానికి మూల స్తంభాలని వైఆర్‌పీ ఫౌండేషన్, వైష్ణోయ్ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎండీ యెలిశాల రవిప్రసాద్ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవీకాలనీలోని వైఆర్‌పీ కార్యాలయంలో శనివారం ప్రాథమిక, మధ్య, ఉన్నత స్థాయి విద్యార్థులతో పాటు డిగ్రీ, ఎంబీబీఎస్ చదివే 40మందికి పైగా విద్యార్థులకు రూ.15లక్షల స్కాలర్‌షిప్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఆర్‌పీ ఫౌండేషన్ స్థాపించిన పదేళ్ల నాటి నుంచి నేటి వరకు 300 మందికి పైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశామని తెలిపారు.


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న యెలిశాల రవిప్రసాద్

అవినీతి ఫిర్యాదులపై డిస్కం దృష్టి

- మేడ్చల్, సరూర్‌నగర్, హబ్సిగూడ సర్కిళ్లలో కొందరిపై ఫిర్యాదులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ గ్రేటర్ పరిధిలోని పలు సర్కిళ్లలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతిపై వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించింది. మేడ్చల్, సరూర్‌నగర్, హబ్సిగూడ సర్కిళ్ల పరిధిలో కొంతమంది ఆర్టిజన్లతో పాటు లైన్‌మన్లు, ఏఈలు, ఏడీఈ, డీఈలపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. పలు సెక్షన్లలో కొంతమంది అధికారులు తమకు నచ్చిన వ్యక్తులకే కాంట్రాక్టు పనులు అప్పగిస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయి. పలు డివిజన్లలో కొంతమంది డీఈ, ఏడీఈ స్థాయి అధికారులు డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి ఫిర్యాదులు, గతేడాది కాలంగా ఆయా డివిజన్లు, సెక్షన్లలో చేపట్టిన పనులపై విచారణలు చేపట్టేదిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అవినీతి సెల్‌కు పెద్దసంఖ్యలో ఫిర్యాదులు రావడంపై కొంతమంది అధికారులు, సిబ్బంది తమపై ఎప్పుడూ చర్యలు తీసుకుంటారనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి ఆరోపణలపై వచ్చే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

సామూహిక నిమజ్జనానికి సర్వం సిద్ధం.!

- సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌పై నిమజ్జన ఆంక్షలు
- చెరువుకట్టపై పోలీసుల డేగ కన్ను!
- నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు : డీసీపీ ప్రవీణ్‌కుమార్



మినీట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న భారీక్రేన్

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): గణనాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం ముగిసేలా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. మినీ ట్యాంక్‌బండ్‌గా పిలవబడే సరూర్‌నగర్ చెరువుకు వాడ వాడలు.. కాలనీలతో పాటు శివారు గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో గణనాథుని విగ్రహాలు నిమజ్జనానికి తరలిరానుండడంతో గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులకు, భక్తులకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా, నిమజ్జనం ప్రశాంతవాతావరణంలో కొనసాగేందుకు చెరువుకట్టపైకి వచ్చే నిమజ్జన వాహనాలకు పలు ఆంక్షలను విధించినట్లు డీసీపీ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. నిమజ్జన అంక్షలు, నిమజ్జన రూట్ మ్యాప్ ప్రకారం వాహనాలు తీసుకువచ్చి నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అపశృతులు దొర్లకుండా ఉండేందుకు ప్రజలు, నిర్వాహకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిమజ్జన ఆంక్షలివే..!

సరూర్‌నగర్‌చెరువు కట్టలో నిమజ్జనానికి సరూర్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాలతో పాటు జంటనగరాలు, శివారు ప్రాంతాల నుండి వేలాది వాహనాలలో ఏకదంతుడి విగ్రహాలు తరలిరానుండడంతో సామూహిక నిమజ్జనం రోజు మంగళవారం ఉదయం 10గంటల వరకు విగ్రహాల ఊరేగింపు ప్రారంభించాల్సి ఉంటుంది. సరూర్‌నగర్ చెరువుకట్టపైకి వాయిద్యాలు, డీజే, అశ్లీలనృత్యాలు నిషేధించినట్లు తెలిపారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొన్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఊరేగింపు వాహనాలలో మారణాయుధాలు, కర్రలను కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కట్టపై ట్రాఫిక్ నిబంధనలను పాటించి వీలైనంత త్వరగా నిమజ్జనాన్ని ముగించుకుని వెళ్లాలని నిర్వాహకులకు సూచించారు.

కంట్రోల్ రూమ్స్.. గజ ఈతగాళ్లు..

చెరువుకట్టపై ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో ఒక పోలీస్ కంట్రోల్ రూమ్, వైద్య బృందంచే మెడికల్ క్యాంప్, వాటర్‌వర్క్స్, విద్యుత్ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులతో కూడిన కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. గణనాథుని విగ్రహాలను నిమజ్జనం గావించేందుకు కట్టపై చివరి రోజు 8 క్రేన్లు అందుబాటులో ఉంటాయి. మూడు షిఫ్ట్‌లలో క్రేన్ ఆపరేట్లు 24గంటలు అందుబాటులో ఉంటారు. అదేవిధంగా రెండు బోట్లు, 10మంది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. 20మంది ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు అందుబాటులో ఉంటారు. కట్టపై ఉన్న రెయిలింగ్‌కు సమాంతరంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ బారికేడ్లను దాటి ఎవరిని లోపలికి అనుమతించరు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు.

255 నిఘానేత్రాల కనుసన్నల్లో..

సరూర్‌నగర్ చెరువుకట్టపై ప్రతి కదలికల్ని పసిగట్టేందుకు 55 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాహనాల ప్రవేశమార్గం వద్ద 3, ఎగ్జిట్ పాయింట్ వద్ద 3 కెమెరాలతో పాటు క్రేన్‌ల వద్ద ఒక్కో సీసీ కెమెరాను అమర్చారు. వీటితో పాటు కట్టపై మొత్తం 55 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు అన్ని కదలికలను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నిమజ్జన రూట్‌లో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

600 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు



నిమజ్జనం సందర్భంగా సరూర్‌నగర్ చెరువుకట్ట, నాగోల్‌పాండ్, తుర్కయంజాల్, అబ్దుల్లాపూర్‌మెట్ ఖైరాన్‌ఖాన్ చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశాం. నిమజ్జనానికి ఎల్బీనగర్ సబ్ డివిజన్ పోలీసు సిబ్బందితో పాటు ఒక డీసీపీ, ఒక అడిషనల్ ఎస్పీ, నలుగురు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో సహా 600 మంది పోలీసు సిబ్బంది నిమజ్జన బందోబస్తు చేపట్టనున్నారు. సామూహిక నిమజ్జనం రోజు ప్రతి నాలుగు కాలనీలకు ఒక పెట్రోలింగ్ వాహనాన్ని కేటాయించి గస్తీ చేపట్టనున్నాం. 20 మొబైల్ పార్టీలు భద్రతను పర్యవేక్షించనున్నాయి. 27 పికెట్లు ఏర్పాటు చేయడంతో పాటు సరూర్‌నగర్ పీఎస్ పరిధిలోని 115 కాలనీలలో గస్తీ ముమ్మరం చేసి ఊరేగింపు వాహనాలు సాఫీగా తరలివెళ్లేలా వ్యూహం సిద్ధం చేయడం జరిగింది.

- ప్రవీణ్‌కుమార్, డీసీపీ, ఎల్బీనగర్

అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : మల్‌రెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ, మన్నెగూడ, ఇంజాపూర్‌లోని వివిధ వార్డుల్లో రూ. 11కోట్ల 96 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛాభారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛాతాహి సేవా కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోడ్డు అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధారాంరెడ్డి, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ హరితాధన్‌రాజ్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్యయ్య, పార్టీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు మర్రి మాధవి, అనురాధ, కుంట ఉదయశ్రీ, బొక్క శ్రీలత, భాగ్యమ్మ, హరిత, కొశిక ఐలయ్య పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

'స్వచ్ఛతే సేవ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్న 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమాన్ని పారిశుధ్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి విజయవంతం చేయాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి సూచించారు. 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివా రం మునిసిపల్ కార్యాలయంలో పారిశుధ్య సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ మునిసిపల్ కమిషనర్ రఘు పర్యవేక్షణలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యుల సహకారంతో కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించడానికి అవసరమైన కార్యక్రమా లు చేపడతామని, ప్రజలు సైతం తమకు సహకరించాలని ఆయన కోరా రు. కార్యక్రమంలో టీపీఎస్ లాలప్ప, వర్క్ ఇన్‌స్పెక్టర్ బొల్లం రాకేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి

స్కూటీని ఢీకొట్టిన లారీ.. అక్కడికక్కడే యువకుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): యూటర్న్ తీసుకుంటున్న స్కూటీని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై ఉన్న యువకుడు కిందపడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మజీద్‌పూర్ గ్రామానికి చెందిన కొండ దేవేందర్ చైతన్యపురిలోని ఓ బేకరిలో పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున చైతన్యపురి నుంచి మజీద్‌పూర్‌కు స్కూటీపై వస్తున్నాడు. ఉదయం 7గంటల ప్రాంతంలో అబ్దుల్లాపూర్‌మెట్ చౌరస్తా సమీపంలోని మయూరీ కాంట వద్ద విజయవాడ జాతీయ రహదారిపై అతడు యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ స్కూటీని ఢీకొట్టింది. దానిపై నుంచి కిందపడిన దేవేందర్‌పై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగింత

కొత్తపేట, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పరిధిలో ఓ ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లి డబ్బు చోరీ చేసేందుకు యత్నం చేస్తున్న దొంగను ఆలయ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్‌హెచ్‌ఓ కే.వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ అర్చకుడు పండాలి శివశంకరశాస్త్రి ఈనెల 13 రాత్రి 9 గంటలకు ఆలయ గేటుకు తాళం వేసి నిద్రపోయాడు. మధ్య రాత్రి దాటిన తర్వాత మెలకువ రావడంతో మొబైల్ ఫోన్‌లో సీసీ టీవీ ఫుటేజీ పరిశీలిస్తున్నాడు. ఓ దొంగ ఆలయం గోడ దూకి లోపలకు ప్రవేశించాడు. ఆలయ ప్రాంగణంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలోని హుండీ తీసుకుని ఆలయం వెనుకకు వెళ్లాడు. వెంటనే ఆయన ఆలయ స్వీపర్ శివకుమార్, ఆఫీస్ బాయ్ నరేష్‌లను అప్రమత్తం చేశాడు. ముగ్గురూ కలిసి దొంగను పట్టుకుని స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. శివశంకరశాస్త్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. అతడు నాగర్‌కర్నూల్‌కు చెందిన రావిరాల సంపత్‌కుమార్(30) అనే పాత నేరస్తుడని విచారణలో తేలింది. అతడు 5 సంవత్సరాల క్రితం నగరానికి వచ్చాడు. చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించడం కోసం ఆలయంలో దొంగతనం చేయడం మొదలు పెట్టాడు. నగరంలో, శివారుల్లో నాలుగేళ్ల నుండి రాత్రి వేళ ఆలయాల్లో చోరీలకు పాల్పడుతూ బస్‌స్టాపుల్లో నిద్రిస్తూ జీవనం సాగిస్తున్నారు. పలు మార్లు కటకటాలు లెక్కించినా నేరాల బాట వీడలేదు. సైదాబాద్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, ఘట్‌కేసర్ పీఎస్‌ల పరిధిలో అతడు పలు కేసుల్లో అరెస్టై కటకటాలు లెక్కించాడు. నేరం అంగీకరించడంతో అతడిని పోలీసులు రిమాండుకు తరలించారు.


సంపత్‌కుమార్

కర్మన్‌ఘాట్ గణేశ్ లడ్డూ రూ.4.37 లక్షలు

చంపాపేట, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో గణపతి నవరాత్రులను పురష్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయకుల లడ్డూలకు శనివారం నిర్వహించిన వేలంపాటలో రెండు లడ్డూలకు రూ.4.37లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు తెలిపారు. ఆలయంలోని మూల విరాట్ వరసిద్ధి వినాయకస్వామి లడ్డూను వేలంపాటలో ఆలయ మాజీ డైరెక్టర్ బసిగూడెం జంగారెడ్డి, సుజాత దంపతులు, కుమారుడు సోమనాథ్‌రెడ్డి రూ.1.71లక్షలు, శ్రీ విజయ వినాయకస్వామి లడ్డూను మహేశ్వరం మండలం దుబ్బచర్లకు చెందిన దడ్వాయి రమేష్‌కుమార్, జ్యోతి దంపతులు రూ.2.66లక్షలకు దక్కించుకున్నారు. లడ్డూ గ్రహీతలను ఆలయ ఈఓ ఘనంగా సన్మానించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, మాజీ ధర్మకర్తలు, అర్చకులు కందాళ సంతోష్‌కుమార్, శ్రీను, శ్రవణ్, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

రూ.1,05,116లు పలికిన స్నేహపురి కాలనీ లడ్డూ

కొత్తపేట : స్నేహపురి కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలం పాటను శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్, స్నేహపురి శ్రీవేంకటేశ్వర ఆల యం మాజీ చైర్మన్ అనంతుల యాదగిరిరెడ్డి రూ.1,05,116లకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు అనంతుల సురేందర్ రెడ్డి, ప్రతినిధులు ప్రసాద్, బాబ్జీ, అనంతుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

టీపీసీసీ కాంగ్రెస్ ఇన్‌చార్జికి స్వాగతం పలికిన నేతలు

చంపాపేట, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేసిన తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి పీసీ విష్ణునాథ్‌ని శనివారం రాజీవ్‌గాంధీ విమానాశ్రయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ డైరెక్టర్ బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు చీర తిరుమలేష్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, మేకల యాదగిరి పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

- నిజనిర్ధారణ కమిటీ సభ్యులను విడుదల చేయాలి
- పౌర హక్కుల సంఘం నేతలు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రఘునాథ్‌పాలెం కరికగూడెం ఆడవులలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ గుంటి రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సురేష్, నగర అధ్యక్షుడు పి.ఎం.రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలను తెలుసుకుని ప్రజలకు తెలియజేయడానికి సంఘటన స్థలానికి వెళ్తున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, కార్యదర్శి నారాయణరావు, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలన్న, హైదరాబాద్ సభ్యులు సుదర్శన్, వెంకటేష్, బాలకృష్ణ తదితరులను ఖమ్మం జిల్లా పోలీసులు మణుగురు బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి అశ్వరావుపేట పీఎస్‌కు తరలించారని వారన్నారు. బూటకను ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని ఈ వాస్తవాలను నిజనిర్ధారణ కమిటీ బయటపెడుతుందనే పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గుంటి రవి


కుర్మబస్తీ గణనాథుడిని దర్శించుకున్న ఎంపీ రఘునందన్, సుభాష్‌చందర్జీ, చీకోటి ప్రవీణ్


బడంగ్‌పేట్ 29వ డివిజన్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి


గడ్డిఅన్నారంలో గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి


మాదన్నపేటలో గణేశుడిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, సమరసింహారెడ్డి తదితరులు

గణపయ్యకు ఘనంగా పూజలు

సైదాబాద్/చంపాపేట, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్, ఐఎస్‌సదన్, కుర్మగూడ, అక్బర్‌బాగ్, చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేసి హోమంలో పాల్గొన్నారు. హస్తినాపురం డివిజన్ అగ్రికల్చర్‌కాలనీలో వినాయక నవరాత్రుల్లో భాగంగా కాలనీ అధ్యక్షుడు జి.చంద్రమోహన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కాలనీప్రతినిధులు, భక్తులు గోమాతకు పూజలు చేశారు. అనంతరం మహిళలు దాండియా ఆటపాటలతో నవరాత్రులను జరుపుకున్నారు.

సరూర్‌నగర్: బాలాపూర్‌లోని ప్రధాన వినాయకుడిని శనివారం టీపీసీసీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి దర్శించుకోగా ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆయనకు ప్రసాదం అందజేశారు. బడంగ్‌పేట్‌లోని బడా వినాయకుడిని సైతం ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే సబితారెడ్డి పూజలు

బడంగ్‌పేట్ 29వ డివిజన్‌లోని పలు కాలనీల్లో ప్రతిష్ఠించిన గణనాథులను శనివారం కార్పొరేటర్ పెద్దబావి శోభాఆనంద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పి.సబితారెడ్డి దర్శించుకున్నారు. పూజలు, అర్చనలు చేశారు. ఆయా మండపాల నిర్వాహకులు ఆమెను శాలువాతో సత్కరించారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్‌లో శ్రీవీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్యను శనివారం మునిసిపల్ కమిషనర్ జి.రఘు, ఇతర అధికారులు, సిబ్బంది దర్శించుకున్నారు. వారిని ఉత్సవ సమితి ప్రతినిధులు సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు.


కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ప్రతినిధులు తిరుపతాచారి, మాధవాచారి, వెంకటాచారి, వెంకటేశ్ తదితరులు


ఆర్‌కేపురంలో గణపతి మండపాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉపేందర్‌రెడ్డి, పున్న గణేశ్, బండి మధు, రవీంద్ర, ధన్‌రాజ్


ఎల్‌సీహెచ్‌కాలనీ వినాయక మండపంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, హరిగౌడ్‌లకు సన్మానం